## వైభవంగా సుదర్శన నారసింహ హోమం

సుదర్శన నారసింహహోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఆగస్టు17: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంలో శనివారం సుదర్శన నారసింహహోమం వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజవాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవసేవ జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వెంచేపు చేసి కల్యాణతంతును చేపట్టారు. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 25వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 31,08,816 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశికధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

**స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు**

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని శనివారం రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి ముత్యాల రాజు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి సంప్రదాయ స్వాగతం పలికి, వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామి వారి ప్రసాదాన్ని అందించారు.

**ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు**

ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ధార్మిక సాహిత్య సంగీత సభలో భాగంగా వరవీణ మ్యూజిక్ అకాడమీ వారిచే భక్తి సంగీతం, హైదరాబాద్‌కు చెందిన శేఖర్ మాస్టర్ బృందం వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు.

## వైద్యురాలిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

- ఐఎంఏ అధ్యక్షుడు విజయ్‌భార్గవ్
- వెస్ట్ బెంగాల్ ఘటనను నిరసిస్తూ వైద్యుల ర్యాలీ, కొవ్వొత్తులతో ప్రదర్శన

చౌటుప్పల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు

భువనగిరి అర్బన్, ఆగస్టు 17: వెస్ట్ బెంగాల్‌లో వైద్యురాలు మమతను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐఎంఏ భువనగిరి ప్రెసిడెంట్ డాక్టర్ విజయ్‌భార్గవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైద్యురాలిపై జరిగిన పాశవిక దాడిని నిరసిస్తూ ఐఎంఏ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ ఏరియా దవాఖాన నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను కాపాడే డాక్టర్లకు రక్షణ లేకపోవడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు నిందితులను వెంటనే శిక్షించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు ఎడ్ల అనిల్‌కుమార్‌రెడ్డి, అజయ్‌కుమార్, రాజ్‌కుమార్, సుమంత్, ప్రసాద్, ప్రశాంతి, ఇందిర, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

- బీబీనగర్ : మండలంలోని బీబీనగర్ ఎయిమ్స్ నుంచి పట్టణ కేంద్రం వరకు వైద్యులు ర్యాలీ నిర్వహించారు. వైద్యులకు రక్షణ కల్పించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీబీనగర్ ఎయిమ్స్ డాక్టర్లు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.
- భూదాన్‌పోచంపల్లి : ఫస్ట్ ఎయిడ్ అండ్ మెడికల్ హెల్త్ అసోసియేషన్, కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భూదాన్‌పోచంపల్లిలో నిరసన ర్యాలీ నిర్వహించారు. గ్రామీణ వైద్యులు స్వచ్ఛందంగా బంద్ పాటించి ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఫస్ట్ ఎయిడ్ మెడికల్ హెల్త్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరపల్లి ప్రమోద్, ఉపాధ్యక్షుడు గుండు అశోక్, కోశాధికారి సీత భాస్కర్, జిల్లా సభ్యుడు సూరపల్లి బాలరాజ్, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకటేశ్, మండలాధ్యక్షుడు అమృతం అశోక్, గౌరవ సలహాదారుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి సుధాకర్, సభ్యులు పాల్గొన్నారు.
- ఆలేరురూరల్ : ఆలేరు సీహెచ్‌సీలో సూపరింటెండెంట్ స్వప్నరాథోడ్, వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు రహీం, స్వప్న, శ్రీధర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.
- ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి వంశీకృష్ణ, ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ అజీజ్, సిబ్బంది పాల్గొన్నారు.
- మోత్కూరు : సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన వ్యక్తం చేశారు. హత్యకు గురైన జూనియర్ డాక్టర్ ఫ్లెక్సీకి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కోక భిక్షం, మండల అధ్యక్షుడు గనగాని నర్సింహ, ప్రధాన కార్యదర్శి పురుగుల రమేశ్, ప్రచార కార్యదర్శి కట్టెకోల యుగేంధర్, గౌరవాధ్యక్షుడు ఎడ్ల యాదగిరిరెడ్డి, ఎల్ రఘువర్దన్, మలిపెద్ది మధు, కొల్లు సైదులు, పాండరి సరిత, ఆంజనేయులు పాల్గొన్నారు.
- చౌటుప్పల్ : పట్టణకేంద్రంలోని సామాజిక ఆరోగ్యకేంద్రం వైద్యులు, సిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహించారు. దవాఖానుంచి గాంధీ పార్కు వరుకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ అలివేలు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. చౌటుప్పల్ డాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. గాంధీపార్కులోని గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలగించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాస్ ప్రసాద్, కాటం రాజు, సుమన్ కళ్యాణ్, ప్రశాంతి, ఉమామహేశ్వరి, ఆలివేలు, సుభాషిని పాల్గొన్నారు.
- రామన్నపేట : మండలకేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన వైద్యులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మృతురాలి ఆత్మ శాంతికోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాణి, సుశీల, కవిత, షాజియా, సబిత, పద్మ, రజిత, కొమ్ము వెంకటేశ్, సత్యనారాయణ, నిర్మల, రామలింగం, రాజు పాల్గొన్నారు.

రామన్నపేటలో నిరసన తెలుసుతున్న వైద్యులు, సిబ్బంది

వలిగొండ పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె. జండగే

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ హనుమంతు కె. జండగే

వలిగొండ, ఆగస్టు 17: సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కె. జండగే సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. దవాఖానకు వస్తున్న రోగులకు అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ల్యాబ్‌లో నిర్వహిస్తున్న పరీక్షలతోపాటు వార్డులల్లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. రికార్డులను పరిశీలించి ఫార్మసీలో ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం మాట్లాడుతూ వైద్యశాలల్లో అన్ని రకాల మందులు, ర్యాపిడ్ కిట్లు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట డాక్టర్ సుమలత, డాక్టర్ స్వామి, డాక్టర్ తేజస్విని, తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, ఎంపీఓ కేదారీశ్వర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పల్లెల్లో పారిశుధ్యాన్ని మెరుగు పర్చాలి

- జడ్పీ సీఈఓ శోభారాణి

మొక్క నాటి నీరుపోస్తున్న జడ్పీ సీఈఓ శోభారాణి

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 17 : గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పర్చేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి అధికారులకు సూచించారు. శనివారం మండలంలోని తుక్కాపురం గ్రామం లో పల్లెప్రకృతి వనం, క్రీడాప్రాంగణం, కంపోస్టుయార్డును ఆమె పరిశీలించారు. హరితహారంలో భాగంగా మొక్కను నాటి మాట్లాడారు. గ్రామ పంచాయతీ నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలని, ప్రజలకు అందుబాటులో ఉండి పూర్తి స్థాయిలో సేవలందించాలని పేర్కొన్నారు. గ్రామంలో కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. ఎంపీడీఓ సీహెచ్. శ్రీనివాసరావు, ఎంపీఓ దినకర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఇంటింటికీ జ్వర సర్వే నిర్వహించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ కె.గంగాధర్

పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గంగాధర్

బీబీనగర్ , ఆగస్టు 17 : సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అవసరమైన చోట్ల ఇంటింటి జ్వర సర్వే నిర్వహించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్ ఆదేశించారు. శనివారం బీబీనగర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను, మందుల స్టాక్, పంపిణీ వివరాలను తెలుసుకొని రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన వెంట పీహెచ్‌సీ డాక్టర్ సుష్మ, వైద్య సిబ్బంది ఉన్నారు.

## స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలి

- ఇన్నర్ వీల్‌క్లబ్ అధ్యక్షురాలు అరుణ

మహిళలకు కుట్టు మిషన్లను అందిస్తున్న ఇన్నర్ వీల్‌క్లబ్ అధ్యక్షురాలు అరుణ

భువనగిరి అర్బన్, ఆగస్టు 17 : స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఇన్నర్ వీల్‌క్లబ్ అధ్యక్షురాలు కె. అరుణ, కార్యదర్శి డాక్టర్ చావా అశ్లేష అన్నారు. పట్టణంలోని పేద మహిళలకు ఉపాధి కల్పించేందుకు శనివారం కుట్టు మిషన్లను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్లబ్ ప్రెసిడెంట్ లావణ్య, సభ్యులు సీహెచ్. వెంకమ్మ, జయశ్రీ, సునీత, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

## నిరాశ్రయులైన చిరు వ్యాపారులను ఆదుకోవాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు

బాధితులతో మాట్లాడుతున్న గోద శ్రీరాములు

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 17 : భువనగిరి పట్టణ సమీపంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయం వద్ద షెడ్లు వేసుకొని వ్యాపారాలు చేసుకునే నిరుపేదల షెడ్లను ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిరాశ్రయులైన వ్యాపారులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. శనివారం ధ్వంసమైన షెడ్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. పట్టణానికి చెందిన పలు కుటుంబాలు ఆలయ సమీపంలో చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటే.. ఈ నెల 12న కొంత మంది వారి షెడ్లను ధ్వంసం చేశారని తెలిపారు. జీవనోపాధి కోల్పోయిన బాధితులకు న్యాయం చేయడంతో పాటు దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అనంతరం బాధితులతో కలిసి ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత, పట్టణ కార్యదర్శి పుట్ట రమేశ్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి లక్ష్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

## బాధ్యతాయుతంగా సామాజిక తనిఖీ చేపట్టాలి

- ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి

వలిగొండ, ఆగస్టు17: ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా చేపట్టిన పనులపై గ్రామాల్లో చేపట్టే సామాజిక తనిఖీని సోషల్ ఆడిట్ బృందం సభ్యులు బాధ్యతయుతంగా నిర్వహించాలని ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోషల్ ఆడిట్ బృందం సభ్యులకు, పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల వారీగా ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు చేపట్టిన పనులనుపై 14వ విడుత సామాజిక తనిఖీ బృందం సభ్యులు ఆడిట్ చేయనున్నట్లు తెలిపారు. పనులు, ఖర్చుల వివరాలను సరి చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ కేదారిశ్వర్, ఏపీఓ పరశురాములు, ఎస్ఆర్‌పీలు జీవన్, మౌనిక పాల్గొన్నారు.

## పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు వేయించాలి

- జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి రామకృష్ణారావు

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు17: పిల్లలకు సరైన సమయంలో నిర్దేశించిన టీకాలు వేయించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ రామకృష్ణారావు సూచించారు. శనివారం పట్టణ పరిధిలోని పగిడిపల్లిలో నిర్వహిస్తున్న విలేజ్ హెల్త్ న్యూట్రిషన్ డే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గర్భిణులు టీడీ వ్యాక్సిన్ రెండు మోతాదులు తీసుకోవాలని, పుట్టిన బిడ్డకు తల్లిపాలు తప్పక తాగించాలని సూచించారు. తల్లిపాలతో బిడ్డల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అనంతారం పల్లె దవాఖాన డాక్టర్ కొండ మురళీమోహన్, సిబ్బంది సురేశ్‌కుమార్, రమాదేవి, జిల్లా వ్యాక్సిన్ కోల్డ్‌చైన్ మేనేజర్ వీరేందర్‌కుమార్, కృష్ణ, మాధవి, నర్సమ్మ, కల్పన, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూదాన్‌పోచంపల్లి ఏఓ బదిలీ

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 17 : మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ ఎజాజ్ అలీఖాన్‌ను రామన్నపేటకు బదిలీ చేస్తూ అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఏవోగా కె.శైలజ మంగళవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

## రోడ్డును 40 ఫీట్లకు విస్తరించాలని వినతి

మోత్కూరు, ఆగస్టు 17 : మోత్కూరు మున్సిపాలిటీ పాలకవర్గ తీర్మానం మేరకు రహదారికి ఇరువైపులా 40ఫీట్ల రోడ్డు విస్తరణను పకడ్బందీగా నిర్వహించాలని కోరుతూ బీజేపీ నాయకులు శనివారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందించారు. రోడ్డు విస్తరణ పనులు చేపట్టి ఏడాది గడినా సరిగా సాగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయన్నారు. డివైడర్ నుంచి ఇరువైపులా రోడ్డును 40ఫీట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు పోచం సోమయ్య, ప్రధాన కార్యదర్శి చేకూరి మల్లేశ్, బీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు ఎడ్ల రాము, శ్రీను పాల్గొన్నారు.

## గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి

భువనగిరి అర్బన్, ఆగస్టు 17: ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోని వారు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో దరఖాస్తులు అందించాలని సూచించారు.

## పోలీసు అమరుల త్యాగానికి 18 ఏండ్లు

ఆత్మకూరు(ఎం),ఆగస్టు 17 : మావోయిస్టులతో పోరాడి అమరులైన పోలీస్ అమరుల త్యాగానికి ఆదివారంతో 18 ఏండ్లు నిండాయి. 2006 ఆగస్టు18న మావోయిస్టులు తమ ఉనికి చాటుకునేందుకు ఆత్మకూరు(ఎం) పోలీస్‌స్టేషన్‌పై దాడి చేశారు. దాడిని పోలీసులు ధైర్యంగా ఎదుర్కొన్నారు. మావోయిస్టులతో జరిగిన ఎదురు కాల్పుల్లో అప్పటి ఎస్ఐ చాంద్‌పాషా, ఏఎస్ఐ మహ్మద్ సుల్తాన్ మొహియోద్దీన్, హోంగార్డు ఇంజమూరి లింగయ్య మృతి చెందారు. విధి నిర్వాహణలో అమరులైన పోలీస్‌లకు మండల ప్రజలు ప్రతి సంవత్సరం నివాళులర్పిస్తారు. వారు చేసిన త్యాగాలను గుర్తు చేసుకుంటున్నారు. ఆదివారం జరిగే కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని గ్రామస్తులు కోరారు.

## చేనేతలో ఆధునిక టెక్నాలజీతో మరింత అభివృద్ధి

రాష్ట్ర హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ అడిషనల్ డైరెక్టర్ పి. వెంకటేశం

సదస్సులో మాట్లాడుతున్న వెంకటేశం

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 17 : వారసత్వంగా వస్తున్న చేనేత వృత్తికి టెక్నాలజీ రంగం తోడైతే మరింతగా అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ అడిషనల్ డైరెక్టర్ పి. వెంకటేశం అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని చేనేత డైహౌస్ భవనంలో ఐఐహెచ్‌టీ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ విద్యా సంవత్సరం నిర్వహించే కోర్సుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా 10 ఐఐహెచ్‌టీ ఇనిస్టిట్యూట్‌లు, నాలుగు రాష్ట్రాల్లో డిప్లమో కోర్సులు నిర్వహించే కేంద్రాలు ఉన్నాయన్నారు. ఐఐహెచ్‌టీకి కేంద్ర ప్రభుత్వ అనుమతి రావడంతో సెప్టెంబర్ 15 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మూడు సంవత్సరాల కోర్సులో ఒక్కో తరగతిలో 60 సీట్లు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన భూదాన్‌పోచంపల్లి మండలానికి ఐఐహెచ్‌టీ మంజూరు చేయడం హర్షణీయమన్నారు. తాత్కాలికంగా హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ క్యాంపస్‌లో తరగతులు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఉండి బీసీలు 23 సంవత్సరాల్లోపు, హెడ్యూల్ కులాలవారు 25 సంవత్సరాల్లోపు ఉన్న వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులని తెలిపారు. ప్రతి విద్యార్థికి నెలకు రూ.2500 , చేనేత కార్మికుడిగా గుర్తింపు ఉంటే కేంద్ర ప్రభుత్వం రూ.5వేల ఉపకార వేతనం అందిస్తుందన్నారు. సంవత్సరానికి రూ.4,050 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, దరఖాస్తులు ఈ నెల 31 వరకు సమర్పించాల్సి ఉందని తెలిపారు. వివరాలకు యాదాద్రి భువనగిరి చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకుడిని గానీ, రాష్ట్ర కమిషనర్ కార్యాలయంలో గానీ సంప్రదించాలని కోరారు. సదస్సులో జిల్లా హ్యాండ్లూమ్ ఏడీ మహ్మద్ కమాల్, హ్యాండ్లూమ్ ఏడీ విద్యాసాగర్, ఎంఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, డీఓ శ్రీనివాస్, ఏడీఓ సాయి, చేనేత సహకార సంఘం మేనేజర్ రుద్ర ఆంజనేయులు, టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, నాయకులు ఎన్నం శివకుమార్, దుద్యాల పాపయ్య, గంజి బసవలింగం, మంగళపల్లి శ్రీహరి, కర్నాటి పురుశోత్తం, భారత భూషణ్, కార్మికులు పాల్గొన్నారు.


బోనాలతో ఆలయానికి తరలివెళ్తున్న మహిళలు, గ్రామస్తులు

## దంతూరులో ఘనంగా బోనాలు

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 17 : మండలంలోని దంతూరు గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శనివారం కాటమయ్య బోనాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ప్రధాన వీధుల గుండా ర్యాలీగా వెళ్లి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు, భక్తుల పూనకాలు, యువకుల కేరింతలతో గ్రామంలో సందడి నెలకొంది. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు సిద్దగోని అంజయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ బత్తుల మాధవీశ్రీశైలంగౌడ్, నాయకులు ఉడతల బాలరాజు, ఎర్ర అశోక్, కొత్త బాలకిషన్, మురళి, పందుల సత్తయ్య, మద్దెల కుమార్ పాల్గొన్నారు.

## బునాదిగాని కాల్వ పూర్తి కోసం ప్రజా ఉద్యమం

సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ జహంగీర్

మోత్కూరు, ఆగస్టు 17 : బునాదిగాని కాల్వ పూర్తి కోసం ప్రజా ఉద్యమం చేపడతామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. శనివారం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన మోత్కూరు, గుండాల మండలాల పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేయడం తప్ప ఎన్ని ప్రభుత్వాలు మారినా కాల్వ పనుల్లో పురోగతి లేదన్నారు. రెండు దశాబ్దాలు గడుస్తున్నా మోత్కూరు, అడ్డగూడూరు, ఆత్మకూరు(ఎం) మండలాల రైతులకు సాగు నీరందించే కాల్వను పూర్తి చేయడంలో పాలకులు విఫలమయ్యారన్నారు. గోదావరి జలాలను బునాదిగాని కాల్వ ద్వారా అందించేందుకు డీపీఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, మండల కార్యదర్శులు గుండు వెంటనర్సు, మద్దెపురం రాజు, రైతు సంఘం నాయకులు పైళ్ల యాదిరెడ్డి, కూరపాటి రాములు, దడిపల్లి ప్రభాకర్, మెతుకు అంజయ్య పాల్గొన్నారు.

## మోటకొండూర్‌లో విద్యుత్ వినియోగదారుల సదస్సు

సదస్సులో పాల్గొన్న విద్యుత్ అధికారులు, రైతులు

మోటకొండూర్, ఆగస్టు 17: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో శనివారం విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించారు. ట్రాన్స్‌కో ఏడీఈ సూర్యనాయక్, ఏఈ వినోద్‌కుమార్ విద్యుత్ సరఫరాపై రైతులకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయానని అని అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ వైర్లు వేలాడుతున్నా, ఫీజ్ పోతున్నా తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## రహీంఖాన్‌పేటలో బస్సులు నిలిపేలా చూడాలని వినతి


ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 17 : మండలంలోని రహీంఖాన్‌పేట, కూరెళ్ల స్టేజీల వద్ద అన్ని డిపోల బస్సులు నిలిపిలా చూడాలని కోరుతూ సీపీఐ నాయకులు శనివారం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు వినతిపత్రం అందించారు. యాదగిరిగుట్టలోని ఎమ్మెల్యే నివాసంలో అయిలయ్యను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహీంఖాన్‌పేట, కూరెళ్ల స్టేజీ వద్ద ప్రతి రోజు తుక్కాపురం, పోతిరెడ్డిపల్లి, పుల్లాయిగూడెం, టీరేపాక, రాఘవాపురం గ్రామాలకు చెందిన ప్రజలు వేరే గ్రామాలకు వెళ్లేందుకు బస్సుల కోసం ఎదురు చూస్తుంటారని తెలిపారు. కానీ ఆయా స్టేజీల వద్ద అన్ని బస్సులు నిలుపక పోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బంద